వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 08 సెప్టెంబర్ 2023


## సమాచార శాఖలో పిఆర్ఓ ధర్మానాయక్ సేవలు మరువలేనివి

రాయచోటి సెప్టెంబర్ 7 ప్రభాతవార్త



సమాచారశాఖలో పిఆర్ఓ ధర్మా నాయక్ చేసిన సేవలు మరువలేనివని సమాచార పౌర సంబంధాల శాఖ డిఐపిఆర్ఓ భరత్‌కుమార్ రెడ్డి, డిపిఆర్ఓ పురుషోత్తంలు పేర్కొన్నారు. గురువారం రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో గల సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో "సెంట్రల్ బ్యూరోఆఫ్ కమ్యూనికేషన్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ (గెజిటెడ్ - పర్మినెంట్)" యూపీఎస్సీ ద్వారా ఎంపికై ప్రస్తుత విధుల నుంచి రిలీవ్ అవుతున్న పిఆర్ఓ బి.ధర్మానాయక్‌ను సమాచార శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ధర్మనాయక్ మాట్లాడుతూ సమాచారశాఖలో తాను విధుల్లో చేరినప్పటి నుంచి అధికారులు సిబ్బంది అందరూ తనని ఎంతో ప్రోత్సహించారని... నేడు కేంద్ర ప్రభుత్వ సర్వీస్‌కు ఎంపిక కావడంలో సమాచార శాఖ అధికారులు సిబ్బంది సహకారాన్ని ఎల్లప్పుడూ మరిచి పోనని, వివిధ పత్రిక విలేకరులు తనకు ఎంతో సహకరించారని కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం బిధర్మా నాయక్‌ను సమాచారశాఖ అధికారులు సిబ్బంది సన్మానించారు.

## వినాయకచవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

### ఆర్‌డిఒ జి.రామక్రిష్ణారెడ్డి

రాజంపేట అర్బన్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త

హిందువులకు అతి పవిత్రమైన వినాయకచవితి ఉత్స వాలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని ఆర్‌డిఒ జి.రామక్రిష్ణారెడ్డి కోరారు. పండు గను ప్రశాంతంగా జరుపుకునేందుకే ప్రభుత్వం అధికారులను సమన్వయం చేసి వివిధ బాధ్యతలను అప్పగించిందని చెప్పారు. గురువారం స్థానిక సబ్ కలె క్టర్ కార్యాలయ సభాభవనంలో వినాయక చవితి ఉత్స వాలపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆర్‌డిఒ మాట్లాడుతూ మండపాల నిర్వహణ, విద్యుత్తు కనెక్షన్‌లు, నిమజ్జన వేడుకలు ప్రధానమైన అంశాలు అన్నారు. వినాయక మండపాల కమిటీ లు ఉత్స వాల నిర్వహణను బాధ్యతగా నెరవేర్చాలన్నారు. విద్యుత్తు సరఫరా విషయంలో నిబం ధనలు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. నిమజ్జన వేడుకలు శాంతియుతంగా ఉండాలన్నారు. మద్యం సేవించి నిమజ్జన వేడుకల్లో పాల్గొంటే చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. సమావేశంలో డిఎస్‌పి విఎన్‌కె చైతన్య, తహశిల్దారు ఎంవి సుబ్ర మణ్యంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్ధన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టమోటాకు నాడు కాసులు-నేడు కన్నీళ్ళు

## నష్టాల బాటలో టమోటా రైతులు



మదనపల్లె, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:

టమోటా రైతులకు నాడు కాసులు కురిపించాయి...నేడు కన్నీళ్ళు తెప్పిస్తున్నాయి.. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు నష్టాల్లో ఉంటున్నారు. మదనపల్లె మార్కెట్‌యార్డులో టమోటా ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. గురువారం మార్కెట్ యార్డులో కిలో టమోటా రెండవ రకం రూ.5 నుంచి 8ల వరకు ధరలు పలికింది. దిగుబడి ఉన్నా టమోటాకు బయట ప్రాంతాల్లో డిమాండ్ లేకపోవడం వల్లే ధరలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. గత 20రోజుల క్రితం కిలో టమోటా రూ.200లు పలకగా, నేడు ఊహించని విధంగా ధరలు తగ్గడం వల్ల టమోటా రైతులు ఆందోళన చెందుతున్నారు. మదనపల్లె నుంచి ఎగుమతి చేసే ప్రాంతాల్లో టమోటా దిగుబడి ఉండడం వల్లే ధరలు రోజు రోజుకు తగ్గుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇంకా ధరలు తగ్గుతాయని వ్యాపారస్తులు తెలిపారు. ఇన్నాళ్ళు టమోటాకు బం గారు ధరలు పలకడంతో రైతులు లక్షాధికారినుంచి కోటీశ్వర్లుగా మారారు. ఉన్న ఫలంగా ధరలు తగ్గడంతో కొత్తగా సాగుచేసిన టమోటా రైతులు కాస్త నిరాశకు గురవుతున్నారు. ఇవే ధరలు కొనసాగితే రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తొందని పలువురు చెబుతున్నారు. అధిక ధరలు లేకపోయినా రైతుకు గిట్టుబాటు ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతుసంఘాల నాయకులు కోరుతున్నారు. ధరలు ఉన్నప్పుడు నియంత్రణకు చర్యలు తీసుకొన్న ప్రభుత్వం ధరలు లేనప్పుడు గిట్టుబాటుకు చర్యలు తీసుకోవాలని కూడా కోరుతున్నారు. దేశవ్యాప్తంగా మదనపల్లె టమెటా ధరలపై చర్చ జరిగిన విషయం తెలిసిందే. ధరలు పతన ధశకు చేరితేకూడా దేశవ్యాప్త చర్చ రావాలని రైతులు కోరుతున్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్షతో మరిన్ని వైద్యసేవలు

## మండలస్థాయి అధికారుల వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ విజయ్‌రామరాజు

మదనపల్లె, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:

ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. "జగనన్న ఆరోగ్య సురక్ష" ద్వారా మరిన్ని వైద్య సేవలు అందించనుందని.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు.. జేసీ గణేష్ కుమార్, అన్ని రెవిన్యూ డివిజన్ల అధికారులతో కలిసి "జగనన్న ఆరోగ్య సురక్ష", జగనన్నకు చెబుదాం కార్యక్రమాల నిర్వహణపై జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ మాసంలో ప్రారంభించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) కార్యక్రమం ద్వారా అన్ని మండలాల్లోని సచివాలయాల స్థాయి నుండి నిర్వహించాలన్నారు. వాలంటీర్లు ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పీహెచ్సీ డాక్టర్లు, స్పెషలిస్టులు ... మండల తాసిల్దార్లు ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు.. వైద్య శిబిరాల నిర్వహణలో భాగస్వామ్యం కావాలన్నారు. అందుకు సంబంధించిన యాప్ ను వాలంటరీ డౌన్లోడ్ చేసుకుని కార్యక్రమానికి ముందే ఇంటింటికి వెళ్లి వైద్య సేవలపై సర్వే చేయించాలన్నారు. ఆశావర్కర్లు ఏఎన్ఎంలు వారికి సంబంధించిన ఆరోగ్య సమస్యలను గుర్తించి.. వారిని మెడికల్ క్యాంపు నిర్వహించే ప్రాంతానికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. మండలాల్లోని తాసిల్దారులు ఎంపీడీవోలు మెడికల్ అధికారులు, నిర్వహణకు సంబంధించిన షామియానాలు, ప్రదేశాన్ని సంబంధిత ఏర్పాట్లను పర్యవేక్షించుకోవాలని తెలి పారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పబ్లిసిటీని క్యాంపు వివరాలను షెడ్యూల్ స్థానిక మండల అధికారులు తయారుచేసి సిద్ధం చేయాలని తెలిపారు. ఐసిడిఎస్, అంగన్వాడి పిల్లలకు, బాలింతరాలకు గర్భిణీలకు, పాఠశాల కాలేజీ విద్యార్థులకు, శిబిరాల ప్రాముఖ్యం తెలియచేయాలని చెప్పారు. మెడికల్ క్యాంపుకు సంబంధించిన మందులను కిట్స్ కు104 వాహనాన్ని వినియోగిం చుకొని



క్యాంపులు నిర్వర్తించాలన్నారు. దీనికి సంబంధించిన విధి విధానాలను విడుదల చేయడం జరుగుతుందని.. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులను విజయవంతం చేయాలని తెలిపారు.

**జగనన్నకు చెబుదాం... కార్యక్రమాన్ని ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలి**

జిల్లాలో ఈనెల 8వ తేదీ నుండి ప్రారంభం కానున్న జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు షెడ్యూలు చేసిన మండలాల్లో.. విధిగా హాజరై ప్రజా ఫిర్యాదులు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమం ఒక్కో మండలంలో జరుగుతుందని.. ఈ శుక్రవారం మొదటగా వేముల మండలంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశానికి స్థానిక విసి హాలు నుండి.. జిల్లా వైద్య శాఖ అధికారి డా. నాగరాజు, జిల్లా ఆస్పత్రి సమన్వయ అధికారి డాక్టర్ హిమదేవి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి సోపానాలు గ్రామ, వార్డు సచివాలయాలు

## నూతన భవనాల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి సెప్టెంబర్ 7, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన గ్రామ, వార్డ్ సచివాలయ వ్యవస్థ చారిత్రాత్మకంగా నిలుస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి మండలం గొర్లముదివేడు పంచాయతీలో గ్రామ సచివాలయం, వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నూతన భవనాల ప్రారంభ కార్యక్రమాలలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివా లయ, వాలంటీర్ వ్యవస్థ ప్రజల ముంగిటకే సేవలు అందిస్తూ భరోసానిస్తోందన్నారు. సచివాలయ అధికా రులు, సిబ్బంది, వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పని చేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో అమలవు చున్న సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రా లు, దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. నిర్దేశిత సమయం కన్నా ముందుగానే ప్రజలకు సేవలు అందుతున్నా యన్నారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రాయచోటి నియో జక వర్గంలో 73 సచివాలయాలుకుగాను 60 సచివాలయాలకు భవన నిర్మా ణాలు, 46 రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలు, 60 విలేజ్ హెల్త్ క్లినిక్ లకుగాను 35 భవన నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. సచివాలయాల్లో జవాబుదారితనం, పారదర్శకంగా సేవలు అందుతున్నాయన్నారు. ప్రజల సమసలు, వినతులుపై సచివాలయ అధికారులు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించారు 52.50లక్షలు నిధులతో గొర్ల ముదివేడు నుండి చెర్లోపల్లెకు సిమెంట్ రోడ్డు శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు

ఈ కార్యక్రమంలో స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, టిటిడి ప్రాంతీయ సలహా మండలి సభ్యుడు ,పార్టీ రాష్ట్ర కార్యదర్శి బసిరెడ్డి సిద్దారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు బసిరెడ్డి సుబ్బారెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు



రమేష్,ఎంపిడిఓ మల్ రెడ్డి, తహసీల్దార్ ప్రేమ్ కుమార్, రాజారెడ్డి, కాంట్రాక్టర్ చలమా రెడ్డి, విశ్వనాధ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, బిసి నాయకుడు ఈశ్వరయ్య, చెన్నకృష్ణ, రామిరెడ్డి, వైఎస్ఆర్ సిపి జిల్లా విద్యార్థి సంఘ అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్ దాస్, మాజీ ఎంపిటిసి చంద్రయ్య, మహేశ్వర రెడ్డి, పండరీ నాధ్ రెడ్డి, కో ఆప్షన్‌ఖాదర్ బాష, పల్లెల నాగమల్ రెడ్డి, చింతం రామచంద్రారెడ్డి, సుబ్బరాయుడు, ఎగువింటి రామయ్య, బుక్కే నరసింహులు నాయక్, వసంత రమేష్, యండపల్లె వెంకట్రామిరెడ్డి, సనావుల్లా, గఫార్‌వలీ రాజా, భాస్కర్, షేక్ రియాజ్ భాషా, మహేష్ రెడ్డి, బసిరెడ్డి నాగార్జున రెడ్డి, బసిరెడ్డి ఈశ్వర్ రెడ్డి, రఘునాథ, పక్కిర రెడ్డి, దస్తగిరి రెడ్డి, ప్రేమనాథరెడ్డి, అల్తాఫ్, రమణయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు

# చంద్రబాబును సీఎం చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రజలు

## రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు గ్యారంటీ కార్యక్రమంలో ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి



రాయచోటి సెప్టెంబర్ 7, ప్రభాతవార్త

- గాడి తప్పిన పరిపాలన...
- ఎక్కడ చూసినా దౌర్జన్యాలు అక్రమాలు
- వైసిపి ప్రభుత్వ వైఫల్యాలే టిడిపికి విజయబాట

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అసమర్థ పాలన వల్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రానున్న ఎన్నికల్లో ప్రజలు తెలుగు దేశం పార్టీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. రామాపురం మండలం గువ్వల చెరువులో గురువారం ఇంటి ఇంటికి తిరుగుతూ.. రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు గ్యారంటీ కార్యక్రమం తెలుగు దేశం పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి మేనిఫెస్టో లో ప్రవేశపెట్టిన పథకాల గురించి ఇంటి ఇంటికి తిరుగుతూ ప్రజలకు ఆయన వివరించారు.

ఈ సందర్భంగా ఆర్ రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కింద నుంచి పై వరకు అవినీతి రాజ్యమేలుతుందని ప్రజలు బాధలను పట్టించుకునే నాధుడే కరువయ్యారని తెలిపారు. ఏ పని కావాలన్నా ప్రజలు ముడుపులు చెల్లించుకోవలసిన దుస్థితి నెలకొందన్నారు. ఆర్థిక క్రమశిక్షణ లోపించిందని లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేశారని ఆ భారం ప్రజలపై మోపారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా తేటతెలమవుతుందని దీంతో వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను లోకేష్ బాబు ఎండగడుతున్న తీరు ప్రజల్లో తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని పాదయాత్ర పూర్తయ్యేలోపు జగన్ రెడ్డి సర్కార్‌కు చరమగీతం తప్పదు అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తి అదుపు తప్పయని తప్పు చేసిన వారిని శిక్షించాల్సిన యంత్రాంగం అమాయకులపై కేసులు పెట్టి వేధింపులు గురి చేస్తున్నారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చగా మారుతుందన్నారు. రహదారుల అభివృద్ధికి కాలువల నిర్వహణ మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అవి అధ్వానంగా తయారయ్యా అని పేర్కొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ లోవర్షాలు సరిగా పడకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం మూడు వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి నాలుగు వేల కోట్లతో ప్రకృతి విపత్తుల నిధి ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అయితే నేడు అవేమీ ఏర్పాటు చేయకుండా రైతులను మోసం చేశారని ఆరోపించారు. మళ్లీ పాలనను సక్రమమైన మార్గంలో నడిపించాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన అసమర్థ నిర్ణయాలు విద్యుత్ పన్నుల పేరుతో మోపుతున్న ధరల వల్ల వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుందని ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజలు చంద్రబాబును గెలిపించాలని ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు ఒకే తాటిపై నిలిచి పని చేస్తారని తెలిపారు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలు అసమర్థ నిర్ణయాలను సరిదిద్ది మంచి రాష్ట్రంగా తీర్చిదిద్దగలిగిన సమర్థ నేత చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నా కొత్త పరిశ్రమలు ఏర్పడి నిరుద్యోగ యువతకు ఉపాధి లభించాలన్న రానున్న ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ గెలిపించాల్సిన బాధ్యత ప్రజలందరికీ ఉందని అన్నారు.


కడప రైల్వేస్టేషన్‌ను సందర్శించిన గుంతకల్ డిఆర్ఎం మనీష్ అగర్వాల్ 2లో


# ఓటర్ల జాబితాలో తప్పులు జరిగితే కఠిన చర్యలు

## కలెక్టర్ గిరీష పిఎస్



రాయచోటి సెప్టెంబర్ 7, ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లాలో ఓటర్ల జాబితాలో తప్పులు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ అధికారుల హెచ్చరించారు తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ జాబితా రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని ఆర్డిఓలు, తాసిల్దారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఓటర్ జాబితా సవరణపై ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఈఆర్వోలతో జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపొందించేందుకు సంబంధిత అధికారులందరూ ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి నియోజకవర్గాల వారీగా జంక్ క్యారెక్టర్, సున్నా డోర్ నెంబర్ ఓట్లు, డబుల్ ఎంట్రీ, చనిపోయిన వారి ఓట్లు, షిఫ్టెడ్ ఓట్లు, ఫేక్ ఓటర్ లపై ఎన్నికల కమిషన్ నియమ నిబంధన ప్రకారం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫామ్ 7, ఫామ్ 8 పెండింగ్ లేకుండా వెంటనే పరిశీలించాలన్నారు. ఈరోజు నుంచి ఓటరు జాబితాకు సంబంధించి ఎన్ని సమస్యలు పరిష్కరించారు, అందుకు సంబంధించిన రిపోర్టు ప్రతిరోజు క్రమం తప్పకుండా తమకు పంపాలన్నారు. సాధ్యమైనంతవరకు రెండు రోజులలోపల అన్ని ఫామ్స్ క్లియర్ అయ్యేటట్లు చూడాలన్నారు. పోలింగ్ బూత్ వారీగా బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఒక ఇంటి నుంచి మరో ఇంటికి మరో పోలింగ్ స్టేషన్ పరిధిలోకి మారి ఉంటే ఆ వివరాలను కూడా నిర్దేశిత ఫారంలో పక్కగా నమోదు చేయాలన్నారు. ఒకే ఇంటిలో పది మంది కంటే ఎక్కువ ఓట్లు ఉన్న వాటిని డోర్ నెంబర్ల వారీగా మరొకసారి తనిఖీ చేయాలన్నారు. క్లెయిమ్స్ మరియు అబ్జెక్షన్స్ను ఒకటికి రెండుసార్లు పక్కాగా పగడ్బందీగా పరిశీలించాలన్నారు. ఆర్డీవోలు, తాహాసిల్దార్‌లు, బిఎల్వోలు ఓటరు జాబితా పరిశీలనలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శ కాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించాలన్నారు. బిఎల్ వోలు ఇంటింటికి వెళ్లినప్పుడు మార్ పెన్నుతో ప్రతి ఇంటిపైన ఎలక్షన్ డోర్ నెంబర్ తప్పక రాయాలన్నారు. అన్నమయ్య జిల్లాలో అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధుల సహకారంతో తప్పులు లేని ఓటర్ జాబితా తయారు చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఓ టర్ జాబితాను ప్రతి అధికారి సీరియస్‌గా తీసుకొని ఎటు వంటి పొరపాటుకు కూడా తావులేకుండా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డిఆర్వో సత్యనారాయణ పాల్గొన్నారు.

# కొత్తమీర పంటతో లాభాలు

- కొత్తిమీర కట్ట రూ.40

- 40 రోజుల్లో పంట చేతికి రావడంతో సాగుపై మక్కువ

రామసముద్రం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :

ప్రస్తుత సీజన్‌లో రైతన్నకు గడ్డుకాలం ఎదురైంది. పండిన అరకొర పంటకు గిట్టుబాటు ధరలేదు. మరికొన్ని చోట్ల సాగు చేసిన పంటలకు సాగునీరు లేక ఎండిపోయాయి. రైతన్నల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. అయితే కరువు పరిస్థితుల్లో కొత్తిమీ సాగ రైతన్నలకు అశాజనకంగా కనిపిస్తోంది. నియోజకవర్గంలోని రామసముద్రం మండలంలో పలు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా ఈ పంటను పండించి లాభపడుతున్నారు. చుట్టూ ప్రక్కల గ్రామాల్లో సుమారు 500ఎకరాల వరకు ఈ పంటను సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్తిమీర పంట కేవలం 40రోజుల్లోనే చేతికి అందుతుండడంతో సాగునీరు ఉన్న రైతన్నలు ఎక్కువ మంది కొత్తిమీర సాగుపట్ల మక్కువ చూపుతున్నారు. ఇప్పుడు మార్కెట్‌లో కొత్తమీర కట్ట రూ.40లు పలుకుతోంది. కొత్తమీర పంటను హైదరాబాద్, మహబూబ్‌నగర్, కర్నాటక రాష్ట్రంలోని బళ్ళారి, రాయచూరు, చెన్నై తదితర రాష్ట్రాలకు ఎగుమతి అధికంగా ఉంటుంది. కొత్తిమీర పంట ఆశాజనకంగానే ఉంది. పంటకు ప్రస్తుతం కొద్దోగొప్పో గిట్టుబాటు ధర పలకుతుండడం విశేషం. పశ్చిమాన టమోటా పంట అధికంగా వేశారు. పంట బాగా దిగుబడి వచ్చి ధరలు పెరిగినా ఆశాజనకంగా ఉన్న కొత్తిమీరను కూడా వేయడంతో కొత్తమీర సాగు మాత్రం కాసులు కురిపిస్తోంది. ఈ పంట ద్వారా వస్తున్న ఆదాయంతో రైతన్నలు కొంత ఊరట చెందు తున్నారు. ఈ పంట సాగు చేయాలంటే ఒక ఎకరా పంటకు పెట్టుబడి రూ.20వేలు నుంచి 25వేల వరకు ఉంటుందని రైతన్నలు చెబుతున్నారు.



విత్తనాలకు రూ.10వేలు, ఎరువులు కలుపుతో పాటు ఇతర పెట్టుబడులకు రూ.10వేలు ఖర్చు అవుతుందని చెబుతున్నారు. ఒక ఎకరంలో 80నుంచి 100 మళ్లు ఉంటాయి. పంట చేతికి 40రోజుల్లో అందుతుందని దీంతో పంట సాగుకు కొంత ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రైతులు లాభపడుతున్నారు. కొత్తిమీరకు ధర భాగా ఉంది. కొత్తిమీర పంటకు ధర భాగా ఉంటే ఎకరాకు దాదాపు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని రైతులు పేర్కుంటున్నారు.

# కుమార్తెకు ఆదర్శ వివాహం చేసిన ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు సెప్టెంబర్ 7, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ప్రధమ కుమార్తె పల్లవి ప్రేమించిన వ్యక్తితో గురువారం వివాహం జరిపించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పవన్‌కుమార్‌ను తన కుమార్తె ప్రేమించిందని తెలుసుకొని పవన్ తల్లిదండ్రులతో చర్చించి గురువారం ఉదయం బొల్లవరం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వివాహం జరిపించారు అనంతరం స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని చేరుకుని కుమార్తె వివాహాన్ని రిజిస్టర్ చేయించి అందరికీ ఆదర్శంగా నిలిచారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఇద్దరు కుమార్తెలని అందులో ప్రధమ కుమార్తె వివాహాన్ని అత్యంత నిరాడంబరంగా జరిపించామని పేర్కొన్నారు. ఆమె ప్రేమించిన అబ్బాయితోనే కులాంతర వివాహం జరిపించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. తన కుమార్తె చదువుకుంటున్న సమయంలో ఒక అబ్బాయిని ప్రేమిస్తే వారి స్థాయి, కుల మతాలు చూడకుండా తన కుమార్తె తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తూ వారిద్దరికీ వివాహం జరిపించామన్నారు. తన కుటుంబంలోని కష్టాలను నష్టాలను ప్రజలతో పంచుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. అబ్బాయి ఆర్థికంగా వెనుకబాటు సామాజికంగా తన స్థాయి కాదని ఆత్మీయులు గుర్తు చేసినా కుమార్తె ప్రేమించిన అబ్బాయితోనే వివాహం జరిపించాలనేదే తన నిర్ణయం అన్నారు. ప్రతి పిల్లల తల్లిదండ్రులు పిల్లల మనసెరిగి



ఎక్కడైతే వారు సంతోషంగా జీవిస్తారో తెలుసుకొని పిల్లలకు తగినట్లుగా నడుచుకోవాలని తల్లిదండ్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. కార్య క్రమంలో వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి రాయలసీమ పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు కాకర్ల నాగశేషారెడ్డి మున్సిపల్ వైస్‌చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి ఎమ్మెల్యే రాచమల్లు కుటుంబ సభ్యులు కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

జనసేన నాయకులు రాందాస్‌చౌదరి

మదనపల్లె, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :



ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి తెలిపారు. గురువారం మదనపల్లె సబ్‌జైలులో ప్రతిపక్ష నాయకులను, కార్యకర్తలను ఆయన కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా రాందాస్‌చౌదరి మాట్లాడుతూ వైసిపి రాక్షసపాలనలో, అరాచక పాలనలో ప్రతిపక్షాలు, విపక్షాలు ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కోల్పోతున్నారన్నారు. నెలరోజుల నుంచి జనసేన సాను భూతిపరులను జైలులో పెట్టిన అయజ్ జైలులో ఉంచడం అన్యాయమన్నారు. చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్‌ను తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తి అయినందున ఆయన అంగళ్ళు అలర్ల కేసులో లేకపోయినా కేసు నమోదు చేసి జైలుకు తరలించారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వానికి ప్రజలు బుద్దిచెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. జైలులో ఉన్న ప్రతి ఒక్కరు మనోధైర్యం కోల్పోకుండా ఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు జంగాల శివరామ్, గడ్డం లక్ష్మీపతి, గ్రానైట్‌బాబు, అడప సురేంద్ర, నవాజ్, రెడ్డమ్మ, జనార్ధన్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీక్రిష్ణాష్టమి వేడుకలు

కమిటీ సభ్యులచే భక్తులకు అన్నదానం

మదనపల్లె, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :



పట్టణ సమీపంలోని అనప గుట్ట శ్రీవారినగర్ గోవర్ధన్‌గిరి శ్రీక్రిష్ణ ఆలయంలో గురువారం శ్రీక్రిష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే నవాజ్ బాషా వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 5గంటలకు అభిషేకాలు, 9గంటలకు కళ్యాణోత్సవం, 11గంటలకు సాంస్కృతికకార్యక్రమాలు, 3గంటలకు వసంతోత్సవం, స్వామివారి ఊరేగింపు జరిగింది. వేలాది మంది భక్తులు శ్రీక్రిష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, క్రిష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా గోవర్ధనగిరిలో శ్రీక్రిష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి.

## ఫేక్ డాక్యుమెంట్లుతో భూ రిజిస్ట్రేషన్లు

న్యాయం చేయాలని పోలీసులకు వినతి

మదనపల్లె, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూ రిజిస్ట్రేషన్‌కు పాల్పడ్డారని వారసులు మదనపల్లె రూరల్ పోలీసులకు విన్నవించారు. బాధితుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. మదనపల్లె రూరల్ మండలం అంకిశెట్టిపల్లె రెవెన్యూ పరిధిలోని చిప్పిలిగ్రామం బెంగుళూరురోడ్డులోని సిలోఎం ఆసుపత్రి ఎదుట ఉన్న సర్వేనెంబర్ 225, 226/ 123లో ఉన్న సెటిల్‌మెంటు భూములు 314/2, 314/4లో ఉన్న డికెటి భూములు కదిరప్ప కుమారుడు జన్నే రామన్న పేరుతో ఉన్నాయన్నారు. ఈ భూములను 1948లో అన్నాసాగరం కుటుంబీకుల నుంచి జన్నే రామన్న కొనుగోలు చేశారన్నారు. అప్పటి నుంచి వీరి ఆధీనంలో ఈ భుములు ఉన్నాయన్నారు. 2000సంవత్సరంలో జన్నేరామన్న మృతి చెందడం జరిగిందన్నారు. రామన్న పేరుతో ఉన్న భూములను 23ఏళ్ళ తరువాత నకిలీ డాక్యుమెంటు సృష్టించి ఇతరులకు విక్రయించారన్నారు. నకిలీ డాక్యుమెంట్లతో సబ్‌రిజిష్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. వీటిపై విచారించి తమకు న్యాయం చేయాలని జన్నే క్రిష్ణమూర్తి, వెంకటరమణ, నరసింహులు, నారాయణ, గోపాల్‌లు కోరారు.

## దుంగాల్ పేరుతో ఆర్‌ఓ ప్లాంటు అభినందనీయం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :



దుంగాల్ చారిటబుల్ ట్రస్టు పేరుతో ఆర్‌ఓప్లాంటు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. గురువారం పట్టణంలోని 8వ వార్డులో దుంగాల్ చారిటబుల్ ట్రస్టు పేరుతో ఏర్పాటుచేసిన ఆర్‌ఓప్లాంటు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలకు ఉచితంగా శుద్దిచేసిన నీటిని అందించేందుకు ప్లాంటు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఏడాదిక్రితం మృతి చెందిన దుంగాల్ జ్ఞాపకార్థంగా తనపేరున వారి కుటుంబసభ్యులు వాటర్‌ప్లాంటును ఏర్పాటు చేయడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో దిలీఫ్, సంతోష్, వైసిపినాయకులు పాల్గొన్నారు.

## వాలంటీర్ల పనితీరుకు ఎమ్మెల్యే దుస్తులు నజరానా



తంబళ్లపల్లె, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని వాలంటీర్లు పని తీరుపై సంతృప్తి చెందిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి వారికి తన వంతు సాయంగా వాలంటీర్లందరికి దుస్తులు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని గోపిదిన్నె సచివాలయంలో గోపిదిన్నె, జింజరపెంట సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, చిన్న రాయుడుల ఆధ్వర్యంలో రెండు పంచాయితీలలో వాలంటీర్లకు దస్తులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లయ్యకొండ ఆలయ కమిటీ మెంబరు ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నరసింహులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో వేడుకగా క్రిష్ణాష్టమి వేడుకలు

మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :



పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌లో వద్ద శ్రీచైతన్య టెక్నో పాఠశాల బ్రాంచ్ 1లో గురువారం శ్రీక్రిష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఇందులో పిల్లలు క్రిష్ణుని, గోపికల విషాధారణలు, ఆటపాటలతో ఎంతో అలరించినట్లు ప్రిన్సిపాల్ ఆర్.విజయలక్ష్మి తెలిపారు. తిరుపతిజోన్ ఏజీఎం సురేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మన సంస్కృతి సాంప్రదాయాలను అలవర్చుకొని ప్రతి పండగ విశిష్టతను తెలిపే విధంగా స్కూల్ యాజమాన్యం వేడుకలను ప్రోత్సహించడం సంతోషంగా ఉందన్నారు. కృష్ణుడు అల్లరివాడు, తుంటరివాడు అయినా లోకానికి మంచిని చేకూర్చినట్లు పేర్కొన్నారు. పిల్లలు కూడా ఎంత అల్లరి చేసినా చదువుల సారాన్ని గ్రహించి లోక క్షేమానికి ప్రయత్నించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో డీన్ అనీల్‌కుమార్, సి బ్యాచ్ ఇన్‌చార్జ్ వెంకటేష్, ప్రైమరీ ఇన్‌చార్జ్ దివ్య, ప్రీప్రైమరీ ఇన్‌చార్జ్ సిద్దిక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలు భక్తిభావంతో నిర్వహించాలి

ఆర్డీఓ, డిఎస్‌పిలు వెల్లడి

మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :



మదనపల్లె డివిజన్ పరిదిలో నిర్వహించబోయే వినాయకచవితి పండుగను సాంప్రదాయ పద్దతిలో భక్తిభావంతో నిర్వహించుకోవాలని ఆర్డీఓ ఎంఎస్.మురళి, డిఎస్‌పి కేశప్పలు తెలిపారు. గురువారం మదనపల్లె ఆర్డీఓ కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశంలో ఆర్డీఓ, డిఎస్‌పిలు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేయబోయే మండపాల నిర్వహణకు సంబంధించి ఊరేగింపులకు సంబంధించి సూచనలు సలహాలను అందజేశారు. నిర్వాహకులు మండపం ఏర్పాటుకు ముందుగా పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. మండపం ఏర్పాటు చేసే స్థలాన్ని ముందుగా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సందర్శించి అనుమతులు మంజూరు చేయాలని ఆర్డీఓ సూచించారు. డిఎస్‌పి కేశప్ప మాట్లాడుతూ మండపాల ఏర్పాటులో డిజే లాంటి ప్రదర్శనలు నిషేదమని, నిర్వాహకులు తప్పనిసరిగా తమశాఖ నుంచి మైక్ పర్మిషన్ తీసుకోవాలని, నిమజ్జనం కూడా ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు చేపట్టాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా నిర్వాహకులపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సిఐ మహబూబ్‌బాషా, తహశీల్దార్లు, ఎస్‌ఐ, పీస్ కమిటీ సభ్యులు బండి బాలాజి, బండి ఆనందర్,సుధాకర్‌రెడ్డి, ఓంప్రకాస్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఇద్దరు వాలెంటీర్లు అరెస్టు

కురబలకోట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :

కర్నాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వాలంటీర్లను గురువారం మండలంలోని అంగళ్ళులో సెబ్‌అధికారులు అరెస్టు చేశారు. కర్నాటక నుంచి అక్రమంగా మద్యం దిగుమతి చేసుకొని విక్రయిస్తుండగా అంగళ్ళు గ్రామానికి చెందిన వాలంటీర్లు అమ్మాజి, సందీప్‌కుమార్‌లను సెబ్ సిఐ శ్రీహరిరెడ్డి అరెస్టు చేశారు. వారి వద్దనుంచి 12బాక్సుల కర్నాటక మద్యం స్వాధీనం చేసుకొన్నారు. కర్నాటకాకు చెందిన ఆటోడ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది. అరెస్టు అయిన వాలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఎంపిడిఓ దిలీఫ్‌కుమార్ తెలిపారు.

## నాటుసారా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

నిమ్మనపల్లె, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:



నిమ్మనపల్లె మండలంలో నాటుసారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్టుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. స్థానిక మేజర్ పంచాయితీ ముద్దిరెడ్డి గారిపల్లె సమీంపలో నాటుసారా విక్రయిస్తున్న వెంకటరమణను అదుపు లోకి తీసుకొని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు. ఇతని వద్ద 8లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు.

## ప్రతి కుటుంబంలో ఆనందం

కురబలకోట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :



నవరత్నాల్లో భాగంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందడంతో వారిలో ఆనందం వెదజల్లుతోందని ఎంపిపి దస్తగిరి సాబ్ అన్నారు. గురువారం మండలం లోని నందిరెడ్డిగారిపల్లె పంచాయితీలో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తుంగావారిపల్లె, పద్దెకటవ, చింతయ్యగారికోట, మారుతినగర్ తదితర గ్రామాల్లో మండల ప్రజాప్రతినిధి వివిధశాఖల అధికారులు పర్యటించి ప్రజాసమస్యలను పరిష్కారం కోసం చొరవ చూపారు. ఇంటింటా అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులు ఎవరైనా ఉంటే సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామని బరోసా ఇచ్చారు. చింతలమాకులపల్లె సచివాలయం నుంచి ఎర్రజానవారిపల్లె వరకు వేసిన రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పిటిసి బైసాని జ్యోతి, ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్బీకే ఛైర్మెన్ శివశంకర్‌రెడ్డి, అధికారులు దిలీఫ్‌కుమార్, వెంకటరెడ్డి, వెంకటేష్, నీరజ, సుగుణ, రాధా, సఫియా, హేమాంబరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ చట్టబద్దతకు మద్దతు తెలపండి

పీలేరు, సెప్టెంబరు 7 ప్రభాతవార్తః



మాన్యశ్రీ మందకష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్,ఎమ్మార్పీయస్ కో ఇంచార్జి అమరాల వెంకటరమణ, వాల్మీకిపురం ఎంఈఎఫ్ నాయకులు సంగీతం రవీశ్వర ఆధ్వర్యంలో ఎమ్మార్పీయస్,ఎంఎస్పీ నాయకులు కలికిరి మండలం మహల్‌లో గడప గడపకు కార్య క్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వద్దకు వెల్లి వినతిపత్రం అందజేశారు. బాజాపా జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్రరెడ్డికి, ఉపాధ్యక్షులు వేముల వెంకటరమణకు వినతిపత్రాలు అందజేసి సెప్టెంబరు 18నుంచి 24 వ తేదీ వరకు జరిగే పార్లమెంటు పమావేశాల్లో షెడ్యూల్ కులాల ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మీ మద్దతు తెలపాలని అన్ని కుల రాజకీయ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం, తహశీల్దారు కార్యాలయం ముందు నిర్వహించే ఎమ్మార్పీయస్ దీక్ష శిబిరానికి మీమద్దతు తెలపాలని వినతిపత్రం ఇచ్చి ఆహ్వానించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బాజాపా జిల్లా ప్రధాన కార్యదర్శి నరేంద్రరెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరమణలు మాట్లాడుతూ మీ వినతిని మా అధిష్టానం దష్టికి తీసుకెల్లి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మా మద్దతు ఎమ్మార్పీయస్‌కు ఎల్లవేళలా ఉంటుందని సానుకూలంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బాజాపా కేవి.పల్లె అధ్యక్షులు రామాంజులు, ఎమ్మార్పీయస్ నాయకులు, ఎంపీఎస్ నాయకులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీక్రిష్ణ జన్మాష్టమి వేడుకలు

రామసముద్రం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :



రామసముద్రం మండలంలోని పలు ఆలయాల్లో గురువారం శ్రీక్రిష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానికంగా దిన్నెపల్లెలో వెలసిన వేణుగోపాల్ స్వామిలయంలో అబ్బు వంశీయులు శ్రీక్రిష్ణాష్టమి వేడుకలు నిర్వ హించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. స్వామికి పలు రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ పూజల్లో మాజీ టిడిపి అధ్యక్షులు క్రిష్ణంరాజు పాల్గొన్నారు. ఎలువానెల్లూరు, ఉప్పినెల్లి, బలసముద్రం గ్రామాల్లోని ఆలయాల్లో క్రిష్ణాష్టమి వేడుకలు జరిగాయి. అర్చకులు అనీల్‌స్వామి ఆధ్వర్యంలో ఎంగొల్లపల్లె గ్రామంలో గ్రామస్థులు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

## గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:

గుర్తు తెలియని వ్యక్తి గురువారం ఉదయం 11 గంటలకు ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్ వద్ద ఉన్న గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. ఇతని వయసు 60 నుంచి 65 సంవత్సరాలుంటాయని ఎర్రగుంట్ల రైల్వే పోలీసు స్టేషన్ ఎస్సై కె.రారాజు తెలిపారు. మరిన్ని వివరాలకు 9440627658 నంబరును సంప్రదించాలన్నారు.

## పీఎంఎఫ్‌ఎంఈ పథకంపై రైతు ఉత్పత్తిదారులకు అవగాహన

పీలేరు, సెప్టెంబరు 7 ప్రభాతవార్తః



ప్రధానమంత్రి ఆహార శుద్ది పరిశ్రమల క్రమబద్దీకరణ పథకంపై స్థానిక మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో ఏపీమాస్ స్వచ్ఛంద సేవా సంస్థ పరిధిలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖాధికారి రవిచంద్ర బాబు మాట్లాడుతూ మహిళలకు నిరుద్యోగ యువతీ యువకులు ఆర్థికంగా స్థిరపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్‌ప్రాసెసింగ్ రంగంలో వారికి ఉన్న పరిజ్ఞానాన్ని జోడించి వ్యాపారాన్ని సమన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు సంకల్పించిందని తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలు, పురుషులు ఎవరైనా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో తమ పరిశ్రమ యొక్క అభివద్దికి లేదా నూతన పరిశ్రమ స్థాపనకు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం సమాజంలో ఫుడ్ ప్రాసెసింగ్‌కి ఎక్కువ డిమాండు ఉందన్నారు. వ్యాపార అభివద్దికి కావలసిన పరికరాల కొనుగోలుకు అయ్యే ఖర్చులో 10 శాతం మాత్రమే లబ్దిదారులు పెట్టుబడిగా 35 శాతాన్ని సబ్సిడీగా 55 శాతాన్ని బ్యాంకు నుంచి రుణం పొందవచ్చునని తెలియజేశారు. పరిశ్రమల ఏర్పాటుకు 10లక్షలు లేదా పాసింగ్ రంగానికి సంబంధించి మూలధనంలో 35 శాతం రైతు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. బియ్యం పిండి రైస్ బ్రాన్ ఆయిల్, నూడిల్స్ , పిండి, అప్పడాల ప్యాకెట్లు, మామిడి జ్యూస్, వేరుసెనగ పప్పు ఆహార ఉత్పత్తులు తయారు చేసుకునేందుకు తగిన మూలధనాన్ని లోన్ రూపంలో సబ్సిడీ రూపంలో ఇవ్వడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని తెలియజేశారు. ఈఅవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాల్సిందిగా గ్రామస్తాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఇది మంచి అవకాశం అని అందరూ సద్వినియోగం చేసుకోవాని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బోదేషావలి, ఏపీఎం లక్ష్మణ్‌రెడ్డి డ, ఏపీ మాస్ డైరెక్టర్ వినాయక్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్లు భార్గవి, వాసు, రమేష్, ఖాదర్‌బాషా, తలపుల సర్పంచి భరత్ , హెచ్‌ఈఓ దరహాస్ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ రాహుల్ గాంధీతోనే సాధ్యం

పీలేరు, సెప్టెంబరు 7 ప్రభాతవార్తః



రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర మొదలు పెట్టి ఒక్క సంవత్సరం పూర్తైన సందర్భంగా ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమతతేజ ఆధ్వ ర్యంలో పీలేరులోని అజంతామిట్టపైన కేకు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్, సీపీఐ నేత శంకర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా అమతతేజ మాటాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు నేడు ఈకార్యక్రమంజరుగుతున్నట్లు తెలి పారు. భారత్ జోడోయాత్ర ద్వారా రాహుల్‌గాంధీ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తిం పును సంపాదించుకున్నారని ప్రజలకు కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ జరగాలంటే కేవలం రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నట్లు అమతతేజ తెలిపారు. సీపీఐ నేత వెంకటేష్, సీపీఎం నేత శంకర్ మాట్లాడుతూ నేడు భారతదేశం శాస్త్రవేత్తలు చంద్రుడిపూ అలాగేసూర్యుడుపై ప్రయోగాలు చేయగలుగుతున్నారు అంటే అప్పటి మన ప్రదాన మంత్రి నెహ్రూ ముందు చూపే కారణం అని కొనియాడారు. బాజాపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ ఒక్క సంస్థని స్థాపించింది లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను వారి యొక్క మిత్రులకు అప్పగించే పనిలోనే ఉన్నారని తెలియజేశారు. రాబోయే ఎన్నికలలో ఇండియా కూటమి దేశ వ్యాప్తంగా విజయం సాగిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు సాయిసంపత్, ఎన్ఎస్‌యుఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలను లైంగికంగా వేధిస్తూ అఘాయిత్యాలకు పాల్పడుతున్న వలంటీర్‌లు

పీలేరు, సెప్టెంబరు 7 ప్రభాతవార్తః



పీలేరు మహిళల్ని టార్గెట్ చేస్తూ వారిని లైంగికంగా వేధిస్తూ అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వలంటీర్‌ల అఘాయిత్యానికి బాధ్యత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటారా లేదా వాళ్ల బినామిలు తీసుకుంటారా అంటూ పీలేరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బెజవాడ దినేష్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆటో డ్రైవరు సుధాకర్ పొట్టకూటి కూటికోసం కువైట్ వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన వలంటీర్ కిశోర్ ఆటో డ్రైవరు భార్య అశ్విని చనువుఖ ఇంటికొస్తూ లైంగికంగా వేధిస్తూ తమ కోర్కెలు తీర్చుకొనేవాడని తన భర్తకు సమాచారం పొక్కడంతో మూడు నెలలకే కువైట్ నుంచి తిరిగి వచ్చిన ఆటో డ్రైవరు సుధాకర్ వలంటీర్ కిశోర్‌ను మందలించడంతో ఇతన్ని ఎలాగైనా అడ్డు తొలగించాలని వలంటీర్ కిశోర్ ముగ్గురు వ్యక్తులతో పాదరసంతో కలిసిన సైనైడ్ ఇంజెక్షన్‌లతో చంపి ఆటో డ్రైవర్ మతికి కారకుడైన వలంటీర్ కిశోర్ కారకుడైయ్యాడని ఆకుటుంబం రోడ్డున పడడంతో కుటుంబానికి పెద్ద దిక్కు మొక్కు ఎవరని దీనికి బాద్యత ఎవరు తీసుకుంటారని వలంటీర్‌కు ఏప్రాతి పదికన కింద ఉద్యోగం కల్పించారో చెప్పాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండుచేశారు. ఈకార్యక్రమంలో రెడ్డెప్ప, మహేష్, శ్రీనివాసరామ, పవన్ పాల్గొన్నారు.

## రాజంపేటలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

నారపురెడ్డిపల్లెలో సందడే సందడి

రాజంపేట అర్బన్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త



జన్మాష్టమి వేడుకలు రాజంపేటలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని పోలిచెరువు కట్టపై వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. యాదవ గ్రామంగా పిలిచే నారపురెడ్డిపల్లెలో క్రిష్ణాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. వేణుగోపాలస్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో చూడముచ్చటగా అలంకరించారు. యాదవ చిన్నారులను చిన్నికృష్ణుని గా వేషదారణతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉట్టి కొట్టే కార్య క్రమంలో యువత పోటీపడి పాల్గొన్నారు. చిన్నారులు ఉట్టిలోని వెన్న తినే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. కార్యక్రమంతో నారపురెడ్డిపల్లెలో సందడి నెలకొంది. మరోవైపు ఇస్కాన్ ఆధ్వర్యంలో కూడా కృష్ణాష్టమి వేడుకలను రాజంపేటలో నిర్వహించారు.

## రక్తహీనత ఆడపిల్లల పురోగాభివద్దికి అవరోధం

డాక్టర్ చంద్రశేఖర్ నాయక్

పీలేరు, సెప్టెంబరు 7 ప్రభాతవార్తః



ఆడపిల్లలకు అన్ని పోషకాలు కలిగిన బలాన్నిచ్చే పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత బారి నుంచి తప్పించుకోవచ్చని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆంధ్ర ప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల బాలికలకు పోషణ, ఆరోగ్యం,అంశంపై తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రశేఖర్‌నాయక్ తమ సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మంచి ఆరోగ్య భాగ్యాన్ని ప్రతి విద్యార్థికి ఇచ్చి ఫలితంగా మెరుగైన విద్యాబుద్దులు మీసొంతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రక్తహీనతకు గురికాకుండా ఆరోగ్య మెలుకువలు పాటించడం పౌష్టికాహారం తీసుకోవాలని అప్పుడే శారీరక, మానసిక పెరుగుదల సాధ్యపడి లక్ష్యాలు సొంతమవుతాయని డాక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరోగ్య సిబ్బంది కుసుమ, భార్గవి, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు , విద్యార్తులు పాల్గొన్నారు.

## పంటలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

ఉద్యానశాఖ అధికారి సురేష్‌బాబు

రాజంపేట అర్బన్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త

ఉద్యానవన పంటలు సాగుచేసిన రైతులు తప్పకుండా ఆర్‌బికెల ద్వారా ఈ క్రాపింగ్‌లో నమోదు చేసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారి జి.సురేష్‌బాబు కోరారు. గురువారం మండలంలోని హస్తవరం, చెర్లోపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. పొలాల వద్ద ఉన్న రైతులతో మాట్లాడుతూ సాగుచేసిన పంటల వివరాలను విస్తీర్ణాన్ని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ఆర్థికసాయం అందించాలన్నా తప్పనిసరిగా ఈ క్రాపింగ్‌లో నమోదై ఉండాలన్నారు. లేనట్లు అయితే ప్రభుత్వ సహాయం అందడం కష్టమవుతుందని పేర్కొన్నారు. పొరపాట్లు జరగకుండా ఆర్‌బికెలలో రైతులు తమ పేర్లను పరిశీలించుకోవాలని కోరారు.

## అభివృద్ధి పల్లెబాటలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

మార్కెట్‌కమిటీ ఛైర్మన్‌రజనీ సురేంద్ర

తంబళ్లపల్లె, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె నియోజకవర్గంలో జరిగే పల్లెబాటలో అడుగడుగునా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చేసిన అభివృద్ధి సాక్షాత్కరిస్తున్నట్లు ములకలచెరువు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రజిని సురేంద్ర కొనియాడారు. గురువారం ఎద్దుల వారి పల్లె పంచాయతీలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రజిని సురేంద్ర, ఎంపీటీసీ కరీముల్లా, వాటర్‌షెడ్ ఛైర్మన్ నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన పల్లెబాటలో ప్రజా ప్రతినిధులు, అధికారులను మారుమూల గ్రామాల్లోని ప్రజలు సైతం మా అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే రాలేదా అని అడగడంతో సభికులు ఆశ్చర్యపోయారు. కాలికి బలపం కట్టుకొని గడప గడపకు తిరుగుతున్న అధికారులు, ప్రజా ప్రతినిధులకు సమస్యలు కానరాకపోవడంతో ఏదో మొక్కుబడిగా పల్లెబాట కార్యక్రమం ముగించడం విశేషం. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు మార్కెట్ కమిటీ ఛైర్మన్ సురేంద్రతో పాటు ఎంపీటీసీ కరీముల్లా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ నారాయణరెడ్డి, మల్లయ్యకొండ ఛైర్మన్ కె.ఆర్.మల్‌రెడ్డి, వైకాపా మండల అధ్యక్షుడు రేపన చౌడేశ్వర, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ మెంబర్ సురేంద్రరెడ్డి, వైకాపా జిల్లా కార్యవర్గ సభ్యుడు రామ్మూర్తి, మాజీ సర్పంచ్ వైవీ రమణారెడ్డి, దండువారిపల్లి శంకర్, సింగిల్ విండో ఛైర్మన్ భార్గవరెడ్డి, ఎంపీడీవో సురేంద్రనాథ్, ఏపీఎం గంగాధర్, ఏపీవో అంజనప్ప, సీసీ భవానీ శంకర్, ఏఈలు అశోక్, హరినాథ్, సుజాత, అధికారులు పాల్గొన్నారు.

## కలికిరిలో ఘనంగా శ్రీకృష్ణ జన్మదిన వేడుకలు

కలికిరి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:



కలికిరిలో గురువారం శ్రీకృష్ణ జన్మదిన వేడుకలను గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు శ్రీకృష్ణుని వేషధారణ దుస్తు లు ధరించి ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీకృష్ణుని చిత్రపటాలు ఉంచి పూజలు చేశారు. శ్రీకృష్ణుని జన్మదినం సందర్భంగా గ్రామాలలో పండగను ఘనంగా నిర్వహించడంతో శ్రీకృష్ణజన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో సైతం వేడుకలను పాఠశాలల యాజమాన్యం తమ విద్యార్థులతో ఘనంగా జరిపారు.

## సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి సీఎంను ఆదరించాలి

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కలికిరి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు మరో సారి కొనసాగాలంటే సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరో సారి జరిగే ఎన్నికల్లో గెలిపించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అద్దేవారిపల్లె పంచా యతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలకు సంబంధించి కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చింతల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఛైర్మన్ డా.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్, వైసీపీ మైనార్టీ సీనియర్ నాయకులు రియాజ్‌అహ్మద్, కలికిరి మండలం వైసీపీ కన్వీనర్ చింతల రమేష్‌కుమార్‌రెడ్డి, కలికిరి మండలం ఎంపీపీ వేంపల్లె నూర్జహాన్, జడ్పీటీసీ పద్మజా లోకవర్ధన్, కలికిరి మండలం సచివాలయాల కన్వీనర్ రెడ్డప్ప, జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి షరీఫ్, కలికిరి మండలం సోషల్ మీడియా ప్రతినిధులు భానుప్రకాష్, కలికిరి పంచాయతీ వార్డు మెంబర్ ఖాదర్‌బాషా, ఎంపీడీవో గంగయ్య, ఈవోఆర్డీ గోవర్ధన్, వీఆర్వో దొరస్వామి, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చదివేవాండ్లపల్లె పాఠశాలను తనిఖీచేసిన ఎంఈఓ

వార్తకు స్పందన



కలికిరి, సెప్టెంబరు 7 ప్రభాతవార్తః

చదివేవాండ్లపల్లె ఉన్నత పాఠశాలను ఎంఈఈ–2 నాగార్జున తనిఖీచేశారు. వార్తా పత్రికలో అక్కడ ఆదమరిస్తే అంతేసంగతులు అన్న వార్త ప్రచురితం కావడం జరిగింది. దీంతో స్పందించిన ఎంఈఓ నాగార్జున చదవేవాండ్లపల్లె పాఠశాలను ఎంఈఓ తనిఖీచేసి పత్రికలో వచ్చిన అంశాలైపై ఆరా తీశారు. గేటుముందు ఉన్న ట్రాన్సుఫార్మర్ వద్ద విద్యార్థులను నిలబెట్టడం పై ప్రధానోపాధ్యాయులు సంపత్‌ను వివరణ కోరడం జరిగింది. అదేవిధంగా పాఠశాలలో నాడు–నేడు పనులలో అవకతవకలపైన వివరణ ఇవ్వాలని హెచ్‌ఎంను కోరారు. అనంతరం ఉపాధ్యాయులతో ఎంఈఓ సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల మర్యాదపూర్వకంగా మాట్లాడాలని హెచ్‌ఎం సంపత్‌కు ఎంఈఓ సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయులపై హెచ్‌ఎంపై ఫిర్యాదులు వస్తే ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంఈఓ నాగార్జున ప్రధానోపాధ్యాయులు సంపత్‌ను హెచ్చరించడం జరిగింది. ఎంఈఓ వెంట సీఆర్పీ రియాజ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ కళ్యాణ మహోత్సవం

### మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో ఆలయ కమిటి నిర్వాహకులు, ఛైర్మన్ నరసింహులు యాదవ్, సభ్యులు బత్తిన గంగయ్యయాదవ్, ఎం. వెంకటయ్య, రమణయ్య, కృష్ణయ్య, శంకర్‌రావు ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, గునిశెట్టి రమేష్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని శ్రీకృష్ణుని కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం కళ్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులకు సకల సదుపాయాలను ఏర్పాటు చేసి కమిటి ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రతియేటా శ్రీకృష్ణ సత్యభామల పరిణయం అత్యంత అద్భుతంగా నిర్వహించడం ఒక్క యాదవ సంఘానికే సాధ్యమని ఎమ్మెల్యే కొనియాడారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అత్యంత ముఖ్యులు పాల్గొనడం సంతోషకరంగా ఉందని అన్నారు. సకల భక్తి భావాలతో శ్రీకృష్ణ సత్యభామల పరిణయం అద్భుతంగా నిర్వహించినట్లు వారు తెలిపారు. అనంతరం కమిటి సభ్యులు అత్యంత వైభవోపేతంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం అందరిని ఆకట్టుకొంది. కార్యక్రమంలో రైల్వేకోడూరుకు చెందిన ఉపసర్పంచ్ తోట శివసాయి, బుడిగి శివయ్య, మాజీ జడ్పిటిసి మారెళ్ల రాజేశ్వరి, ఎం.నాగేంద్ర, రత్తయ్య, వాటర్‌ప్లాంట్ రాజా, నాగేశ్వర్‌రావు, అతిరథ మహారథులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్మరించుకునేందుకే నా భూమి - నా దేశం

రాజంపేట అర్బన్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను గౌరవించుకునేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడి నా మట్టి-నా దేశం అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని బిజెపి రాజంపేట పార్లమెంట్ కన్వీనర్ సాయి లోకేష్ అన్నారు. గురువారం పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుని జన్మస్థలిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పవిత్రమైన మట్టిని సేకరించారు. కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాయిలోకేష్ మాట్లాడుతూ 77వ స్వాతంత్ర్య దినోత్సవాని న్ని పురస్కరించుకుని ఆగస్టు 16 నుంచి 30వ తేది వరకు దేశవ్యాప్తంగా ప్రతి గ్రామ పంచాయతిలో స్మారక స్థూపాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. దేశం కోసం త్యాగం చేసిన అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అమృత్‌కలశ యాత్ర భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాలని పవిత్ర మట్టిని సేకరించి కలశాల ద్వారా ఢిల్లీకి పంపుతారన్నారు. ఆ మట్టితో ఢిల్లీలోని జాతీయ యుద్ధస్మారక స్థూపం సమీపంలో అమృతవాటిక ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసి అక్కడ మొక్కలను నాటుతారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు వై.సురేష్‌రాజు, బత్తల శ్రీరాములు, గ్రామ సర్పంచ్ గౌరీశంకర్, మాజీ సర్పంచ్ ఉద్దండం బ్రహ్మయ్య, జవ్వాజి అదృష్టదీపుడు, మోహన్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం

### పోలింగ్ కేంద్రాలు 2 కిలోమీటర్లు లోపే ఉంటాయి

### ఆర్‌డిఒ జి.రామక్రిష్ణారెడ్డి

రాజంపేట అర్బన్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త

ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పక్కాగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఎలాంటి అపోహలకు తావులేదని రాజంపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆర్‌డిఒ జి.రామక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గంలోని తహశిల్దారులు, ఎన్నికల డిటిలు, రాజకీయ పక్షాల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత గురువారం తమ దృష్టికి తెచ్చిన సమస్యలన్నింటిని పరిష్కరించేదిశగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాజంపేట మండలంలోని 123, 126, 127 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓట్లను మార్పు చేసే విషయాన్ని పక్కాగా చేపడతామన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లు అక్కడే ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. పక్క పోలింగ్ కేంద్రంలో ఉన్న ఓట్లను సంబంధిత పోలింగ్ కేంద్రంలోకే మారుస్తామన్నారు. అలాగే 161, 162 పోలింగ్ కేంద్రాల్లోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఏ పోలింగ్ కేంద్రమైనా 2 కిలోమీటర్ల పరిధిలోనే ఓటర్లు ఉండాలన్నారు. 2 కిలోమీటర్లు దూరం ఉన్నట్లు అయితే సమీపంలోని ఓటర్లకు అనుకూలమైన పోలింగ్ కేంద్రానికి ఓటర్లను మార్చడం లేదా అనువైన ప్రదేశంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఫారం-6, 7, 8 ఫిర్యాదులపై శుక్రవారం లోగా సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. రాజంపేట తహశిల్దారు ఎంవి సుబ్రమణ్యంరెడ్డి, టిడిపి అసెంబ్లి ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్‌రాయుడు, టిడిపి నేతలు ప్రతాప్‌రాజు, జనసేన, సిపిఐ, ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

వేంపల్లె, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :



చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లె మండలంలోని ముతుకూరు గ్రామంలో టీడీపీ మండల కన్వీనరు రామమునిరెడ్డి ఆధ్వర్యంలో బాబుషూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని పథకాల గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. తెదేపా అధికారంలోకి వస్తే 18ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద రూ.18వేలు, చదువుకునే పిల్లలకు రూ.15వేలు, రైతులకు రూ.20వేలు, నిరుద్యోగులకు రూ.3వేలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇవ్వాలని రఘునాథరెడ్డి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనరు రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు మహమ్మద్ షబ్బీర్, మైనార్టి నేత నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, బాలస్వామిరెడ్డి, ముతుకూరు గంగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, ముతుకూరు లక్ష్మినారాయణ, గంగాధర్‌రెడ్డి, పక్కీరారెడ్డి, ముతుకూరు రామచంద్రారెడ్డి, రామగంగిరెడ్డి, మడకా శ్రీనివాసులు, నామా వేమకుమార్, ఆర్.వి.రమేష్, శేషారెడ్డి, డక్కా రమేష్, జబీబుల్లా, మారుతి, మల్లికార్జున, మహమ్మద్, ఇనయతుల్లా, యుగంధర్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలను గుర్తించాలి

దువ్వూరు, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:



గ్రామాల్లో బడి రాకుండా ఇళ్లదగ్గర ఉన్న బడిఈడు పిల్లలను గుర్తించాలని మండల విద్యాశాఖాధికారి రవిశంకర్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బడిఈడు పిల్లలను గుర్తించే కార్యక్రమంపై వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం 5, 6 సంవత్సరాల చిన్నారులే కాకుండా పదో తరగతి చదివి ఇంటి వద్ద ఉన్న విద్యార్థులను గుర్తించి వారిని ఇంటర్‌లో చేర్పించే బాధ్యత మనపై ఉందన్నారు. ఎక్కడ కూడా బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. కొన్నిచోట్ల అంగళ్లలో, వెల్డింగ్‌షాప్‌లలో పని చేస్తున్నారన్నారు. అలాగే పిల్లలను పనిలో ఉంచుకోరాదని వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కావునా సిబ్బంది సమన్వయంతో పని చేసి బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేలా కృషి చేయాలన్నారు. సమీక్షలో ఈవోపీఆర్డీ శివప్రసాద్,వెల్ఫేర్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్

వేంపల్లె, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :



సంక్షేమ పథకాల సారధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని జడ్పీటీసీ సభ్యుడు ఎం.రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనరు కె.చంద్ర ఓబుళరెడ్డి, హజ్ కమిటి డైరెక్టరు మునీర్‌లు అన్నారు. గురువారం వేంపల్లెలోని వైఎస్ఆర్ షాదీఖానాలో ఎంపీడీవో మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన కొత్తగా మంజూరైన వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొత్త పెన్షన్ల కోసం పడిగాపులు పడాల్సి వచ్చేదన్నారు. వైకాపా ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పెన్షన్లు అందజేయడం జరుగుతుందన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ నెరవేర్చి, చెప్పనివి కూడా అమలు పరుస్తున్న ప్రభుత్వం వైకాపా ప్రభుత్వమే అన్నారు. నవరత్నాలు సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపారని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే సీఎం ఆశయాలకు అనుగుణంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అభివృద్ధికి, సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. వేంపల్లె మండలాభివృద్ధికి సీఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డిలు విశేష కృషి చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎం బాలస్వామి, ఈవో సుబ్బారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హసానయ్య, వైస్ ఎంపీపీ బాబాషరీఫ్, ఎంపీటీసీలు కటిక చంద్రశేఖర్, మణిగోపాల్‌రెడ్డి, కొండయ్య, రాజ్‌కుమార్, హబీబుల్లా, భారతి, పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే వైకాపా ప్రభుత్వ లక్ష్యం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :



ప్రజా సంక్షేమమే వైకాపా ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లైస్ డైరెక్టరు గంగాధర్‌రెడ్డి, వైకాపా నాయకుడు ప్రసాద్, బాలబయ్య ఆధ్వర్యంలో రోటరీపురంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో దృఢ సంకల్పంతో రాష్ట్రాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ప్రజాదరణ పొందుతోందన్నారు. సంక్షేమ పథకాలు ఏ స్థాయిలో, ఏయే వర్గాలకు అందుతున్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలనలో భాగంగా సంక్షేమ పథకాలైన నవరత్నాలు, తదితర అంశాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి ఛైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్లు సలీమా, పార్నపల్లె కిషోర్, దాసరి చంద్రమౌళి, కడియాల లక్ష్మినారాయణ, సోఫాల వీరా, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా మండల ఎస్‌జిఎఫ్ఐ ఆటల పోటీలు

చిట్వేలి, సెప్టెంబరు 7 ప్రభాతవార్త



చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎస్‌జిఎఫ్ఐ స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్-14, అండర్-17 విభాగాలకు సంబంధించిన ఆటల పోటీలు ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎబిఎన్ ప్రసాద్ మాట్లాడుతూ చదువు మానసిక ఉల్లాసాన్నిస్తే ఆటలు ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని, చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు షబ్బీర్‌అహ్మద్, సుహాసిని, మండలస్థాయి ఎజిఎఫ్ పోటీలు నేడు, రేపు జరుగుతాయని, ఆటల్లో గెలుపోటములు సహజమని క్రీడా స్ఫూర్తితో ఆడాలని తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం అండర్-17 విభాగంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, త్రోబాల్ బాల బాలికలకు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ పిజికల్ డైరెక్టర్ డేవిడ్‌ప్రసాద్, వెంకటరాజుపల్లె వ్యాయామ ఉపాధ్యాయులు చిట్టిబాబు, నాగవరం ప్రవీణ, కెజిబివి వ్యాయామ ఉపాధ్యాయులు రుక్సానా, పోల్లోపల్లె ఉపాధ్యాయులు హరినాధ్, పాఠశాల ఉపాధ్యాయులు పసుపుల రాజశేఖర్, దుర్గరాజు, దొడ్లవాగు శ్రీనివాసులు, స్వతంత్ర బాబు, సుభాష్ చంద్రబోస్, చిన్నబాబు తదితరులు కార్యక్రమ నిర్వహణలో పాలు పంచుకున్నారు.

## యువగళంలో రాళ్లదాడి అమానుషం

### - భూపేష్‌రెడ్డి



జమ్మలమడుగు, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:

భీమవరంలో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌బాబుపై యువగళం వాలంటీర్లపై జరిగిన రాళ్ల దాడిని జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం జమ్మలమడుగు తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న విధంగా వైసీపీ శ్రేణులు ప్రవర్తించడం పిరికిపంద చర్య అని ప్రజాస్వామ్యంలో ఎవరైనా నిరసనలు, ర్యాలీలు, పాదయాత్రలు శాంతియుతంగా చేసుకునే హక్కు ఉందని అదే విధంగా తెదేపా ప్రభుత్వం అనుకొని ఉంటే మీ నాన్న రాజశేఖర్‌రెడ్డి, మీ చెల్లెలు షర్మిల, మీరు (జగన్) పాదయాత్ర చేసి ఉండేవారా అని మీకు తెదేపా పూర్తి భద్రత ఇచ్చి సహకరించడం జరిగిందని గుర్తు చేశారు. మీరు చేసేది మంచి పద్ధతి కాదని చిల్లర రాజకీయాలు ఏపీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, లక్ష్మీనారాయణ, ఆలీ, దేవిరెడ్డి గురురెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రామిరెడ్డి, రమణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, రామస్వామిరెడ్డి, గంగాధర్, చంద్రమోహన్, హరీష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవరు సుధాకర్ హత్యకేసులో మరో ఐదు మంది అరెస్టు

పీలేరు, సెప్టెంబరు 7 ప్రభాతవార్తః



పీలేరులో గత నెల 31న జరిగిన ఆటో డ్రైవరు సుధాకర్ హత్యకేసులో మరో ఐదుమందిని అరెస్టు చేసినట్లు పీలేరు సీఐ మోహన్‌రెడ్డి స్థానిక మీడియా సమావేశంలో తెలిపారు. ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉన్న ఆటో డ్రైవరు సుధాకర్ తన కుమార్తెను కోటపల్లె బాలికల ఉన్నత పాఠశాలలో వదిలి తిరుగు ప్రయాణంలో ముగ్గురు వ్యక్తులు వచ్చి బస్టాండుకు వెళ్లాలని కోరగా సరే అంటూ ఆటో నడిపే క్రమంలో ఇద్దరు వ్యక్తులు చెరోపక్క విషం నింపిన ఇంజెక్షన్లు వేసి పరారైన నిందితులుతో పాటు ప్రధాన నిందితుడు వలంటీర్ కిశోర్, తిరుపతిఇందిరానగర్‌కు చెందిన ఉమాప్రసాద్, మణికంఠ, సతీష్, విజయ్‌పురంకు చెందిన చందు, నెల్లూరుకు చెందిన సునీల్‌కుమార్, ఆరు మందిని అరెస్టుచేసి వారి వద్ద ఉన్న మారణ ఆయుధాలు స్వాధీనం చేసుకుని రిమాండుకు పంపినట్లు తెలిపారు.

## దోపిడీ రాజ్యం పోవాలి-పేదవాడి రాజ్యం రావాలి

### మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

రాయచోటి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :



రాష్ట్రంలో దోపిడీ రాజ్యం పోవాలి పేదవాడి రాజ్యం రావాలని రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం రాయచోటి పట్టణం సరస్వతి నగర్‌లో రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి రమేష్‌కుమార్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం దోపిడీ రాజ్యాంగ మారిందని ప్రజలు పేదవాడి రాజ్యం కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని రమేష్‌కుమార్‌రెడ్డి కోరారు. తెలుగుదేశం పార్టీని ఎన్.టి.రామారావు స్థాపించి పేదల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారన్నారు తెలుగువారి పేరు ప్రఖ్యాతులు భారతదేశంలో చాటి చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి సైకో పాలన కొనసాగిస్తున్నారని ప్రజలంతా సైకోను ఇంటికి పంపించకపోతే మీరు ఫ్యాన్‌కు ఉరేసుకోవాల్సి వస్తుందన్నారు. పల్లెల్లో పట్టణా ల్లో అభివృద్ధి పనులు ఎక్కడ జరగలేదన్నారు ప్రజల నుంచి ఎన్నుకోబడిన సర్పంచులు ఎంపిటీసీలు జడ్పీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నారు. వీరినిధులు కూడా జగన్ మోహన్ రెడ్డి దారి మళ్లించారు. పల్లెల్లో ఎక్కడ పనులు చేయడానికి నిధులు లేకపోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు సమాధానం చెప్పలేక నానా ఇబ్బందులు పడుతున్నట్లు రమేష్ కుమార్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాజులఖాదర్ భాష,రాజంపేట పార్లమెంట్ ఎస్టి. సెల్ అధ్యక్షులు అమావాస్య రెడ్డెయ్య ,మాబు అలీ ఖాన్ ,సర్దార్ వలి ఖాన్, బ్యాంక్ సుధాకర్ ఎండి రఫీ ,జావిద్,ఫరూక్ ,రెడ్డెయ్య పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలని జనసేన నాయకుల వినతి

రాజంపేట, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :



భవన నిర్మాణ కార్మికుని కుటుంబాన్ని వైఎస్ఆర్‌బీమా వర్తింపజేసి ఆదుకోవాలని తహసీల్దార్‌ను కోరిన రాజంపేట జనసేన పార్టీ నాయకులు అతికారి దినేష్ రాజంపేట నియోజవర్గం చుండూరు వారి పల్లిలో జరిగిన జగనన్న కాలనీలో నాణ్యత లోపం వల్ల ఇంటి మెట్ల నిర్మాణం కూలిన ప్రమాద ఘటనలో మరణించిన భవన నిర్మాణ కార్మికుడు వడ్డే నారాయణ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని రాజంపేట తహసీల్దార్ సుబ్రహ్మణ్యం కలిసి రాజంపేట జనసేన పార్టీ నాయకులు అతికారి దినేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతని కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునేలా ప్రయత్నాలు చేస్తామన్నారు. ప్రమాదం జరిగి 3రోజులు గడిచిన కూడా ప్రభుత్వానికి కాని, ఇక్కడున్న స్థానిక ఎమ్మెల్యే కూడా ఈ విషయం పట్ల స్పందించలేదు కనీసం బాధిత కుటుంబాన్ని పరామర్శించలేదన్నారు. కనీసం వారికి న్యాయం చేయాలని ఆలోచన కూడా లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సదరు కుటుంబానికి న్యాయపరమైన భీమా డబ్బులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. నాసిరకమైన కట్టడాల వలన ప్రజల ప్రాణాలు తీసే ఇలాంటి నకిలీ కాంట్రాక్టర్లని ప్రభుత్వం ప్రోత్సహించకూడదని కూడా రాజంపేట నియోజకవర్గ నాయకుడు దినేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో రెడ్డిరాణి, కత్తి సుబ్బరాయుడు, కోలటం హరికృష్ణ, గుగ్గీళ్ళ నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## యోగివేమన యూనివర్శిటీ ఈసీ మెంబర్ సుబ్బారావుకు సత్కారం

### ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు ప్రత్యేక అభినందనలు తెలిపిన మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ మాలేపాటి సునీల్‌కుమార్

బద్వేల్ అర్బన్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :



యోగివేమన యూనివర్శిటీ ఈసీ మెంబర్‌గా కొండపల్లి చిన్న సుబ్బారావును నియమించడం ఎంతో సంతోషకరమని వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి సునీల్ కుమార్, సురేంద్రబాబు అన్నారు, గురువారం సాయంత్రం వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ మాలేపాటి సునీల్ కుమార్, సురేంద్ర తోపాటు పలువురు కొండపల్లి చిన్న సుబ్బారావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువా గజమాలతో సత్కరించి వారికి అభినందనలు తెలియజేశారు, అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాలేపాటి సునీల్ కుమార్ మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలోని ఆర్యవైశ్యులకు అనేక రంగాలలో పదవులు దక్కడం ఎంతో సంతోషకరమని ఇందుకు సహకరించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సుధ, అడా ఛైర్మన్ సింగసాని గురు మోహన్, మున్సిపల్ ఛైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, తోపాటు పలువురు స్థానిక నాయకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు, కొండపల్లి చిన్న సుబ్బారావు గతంలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులుగా అమ్మవారిశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు అలాగే యోగి వేమన యూనివర్సిటీ ఈసీ మెంబర్ గా కూడా పేద విద్యార్థులకు అవకాశం కల్పించాలన్నారు, భవిష్యత్తులో ఇటువంటి పదవులు రాష్ట్ర స్థాయిలో పొందాలని ఆకాంక్షించారు కార్యక్రమంలో తిరువీధి మురళి, పైడిమర్రి సురేష్ బాబు, రాజేష్, చిందుకూరి శివకుమార్ తోపాటు పలువురు పాల్గొన్నారు, అనంతరం కొండపల్లి చిన్న సుబ్బారావు మహిళా మండలి స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి దంపతులను తులసి సుమలత సత్కరించి వారికి అభినందనలు తెలియజేశారు.

## భారతదేశం బాగుండాలంటే రాహుల్‌గాంధీ ప్రధాని కావాలి

రాయచోటి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:



భారతదేశం బాగుండాలంటే రాజీవ్ గాంధీ ప్రధాని కావాలని బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కమలమ్మ అన్నారు. బిజెపి చేతిలో జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కీలుబొమ్మలుగా మారారని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు సూత్రాలు పథకం అమలవుతుందని అన్నారు. గురువారం రాయచోటి కాంగ్రెస్ పార్టీ కోడూరు అసెంబ్లీ కన్వీనర్ ఎస్ అల్లా బకాష్ సిఎల్పి ఆధ్వర్యంలో చెక్ పోస్ట్ శివాలయం వద్ద నుండి బంగ్లా వరకు ర్యాలీగా వచ్చి అనంతరం బంగ్లా వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత్ జోడోయాత్ర ఏడాది ముగిసిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఆమె అన్నారు. మతసామర్థ్యానికి మానవత్వం మనుగడకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో అధికారం వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలు అమలయ్యాయని దీనివల్ల పేద ప్రజలకు ఎంత మేలు జరుగుతుందని అన్నారు. 57 సంవత్సరాలు కాంగ్రెస్ పాలనలో ఎటువంటి మతసామరస్యాలు కానీ ఉండేవి కామన్నారు.2014 తర్వాత బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా దేశం తయారైంది అన్నారు. బిజెపి వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని ప్రత్యేక ప్యాకేజీ, కడప జిల్లా స్టీల్ ప్లాంట్, దుగ్గరాజపట్నం ఓడరేవు, పోలవరం, విజయవాడ మెట్రో, విశాఖ రైల్వే జోన్, విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఊసే లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో అల్లా బకాష్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు మన్సూర్ అలీ ఖాన్, గోశాల దేవి, శాంతయ్య, రాయచోటి కన్వీనర్ పూల భాస్కర్, పీలేరు కన్వీనర్ రెడ్డి భాష, తంబళ్లపల్లి కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి రాజంపేట కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి పుంగనూరు కన్వీనర్ రామచంద్ర, గోల్డ్ అల్లా బకాష్ ,ఎస్ ఎం డి గౌస్ ,చెన్న కృష్ణ ,ఖాదరవల్లి , మంజునాథ,ఖదీర్ ,రమణమ్మ ,మహమ్మద్ రఫీక్, దినకర్ ,నరేష్ ,మైసూరా రెడ్డి,ఫరూక్, నరేష్ దర్బార్, ఫారుక్, రఫీ, నర్సింహారెడ్డి ,ఉత్తన్న ,వినయ్ ,తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

### మాజీ టిటిడి పాలకమండలి సభ్యులు ప్రసాద్‌బాబు

గాలివీడు, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :



దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని అరవీటివాండ్లపల్లె శ్రీకృష్ణ నగర్ లో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలను సందర్శించడానికి కొంత సమయాన్ని కేటాయించాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని గుర్తుచేశారు. ఆలయాలు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు తార్కాణాలని తెలిపారు. ఆయనవెంట పలువురు టీడీపీ నాయకులు,ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక దారుఢ్యం మానసిక ఉల్లాసం

### వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి

గాలివీడు, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :



క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి పిల్లి నాగరాజుతో కలసి మండలస్థాయి క్రీడా ఎంపికను లాంఛనంగా ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడకారుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఈ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తద్వారా విద్యార్థులు చదువులో వుండే ఒత్తిళ్లను అధిగమించడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మండలస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు,జోనల్,జిల్లా,రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి ఉజ్వల భవిష్యత్తు వుంటుందన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామసభలు

రామాపురం, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :



మండలంలో శుద్ధమల్ల కల్ప నాయునిచెరువు సరస్వతి పల్లి గ్రామాలలో 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పథకం కూలీలు చేసిన పనులకు సంబంధించి సోమాజిక బృందం ఆయా గ్రామ సభ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ సురేంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ సుద్దమళ్ళ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులు 265 పనులకు గాను 2 కోట్ల 10 లక్షల రూపాయలు పనులు జరిగాయన్నారు. గ్రామంలో మొత్తం 772 జాబ్ కార్డు ఉండగా అందులో పనిచేసిన కూలీలు 611 మంది కూలీలు పనులు చేశారన్నారు. ఈ గ్రామంలో ఉపాధి పనులతో పాటు హౌసింగ్ ఆర్టికల్చర్స్ చేపట్టిన పనులపై సామాజిక బృందం రికార్డును పరిశీలించారు. అలాగే కల్ప నాయునిపల్లి గ్రామంలో 121 పనులు సంబంధించి 70 లక్షల 29 వేలు 399 రూపాయలు ఖర్చు చేశారన్నారు. అందులో హౌసింగ్ ఆర్టికల్చర్ డకోటా తదితర పనులపై అధికారులు పనులను రికార్డులను తనిఖీ చేశారు .గ్రామంలో మొత్తం 500 జాబ్ కార్డు ఉండగా 408 మంది జాబ్ కార్డులు కలిగిన కూలి పనుల రికార్డులను తనిఖీ బృందం పరిశీలించారు. అలాగే సరస్వతి పల్లి గ్రామంలో 67 పనులు సంబంధించి రూ 40 లక్షల వరకు ఉపాధి హామీ పథకం పనులు చేపట్టారు. ఈ పనులు హౌసింగ్ ఆర్టికల్చర్ డకోట. పూడికతీత పనుల పైన రికార్డులను పరిశీలించారు. గ్రామంలో మొత్తం 396 జాబ్ కార్డులు ఉండగా అందులో 386 మంది జాబ్ కార్డులు సంబం ధించిన కూలీలు పనులు చేశామన్నారు. పనులు సంబంధించిన రికార్డులను ఆయా గ్రామ సచివాలయాల్లో ఉపాధి కూలీలతో సమావేశం అయ్యి సామాజిక బృందం వారు రికార్డులను తనిఖీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చక్ర నాయక్ డిఆర్ పిలు. నూతన్ పవన్ కుమార్. శ్రీనివాసులు. రామ్మోహన్. టీఏలు రమణారెడ్డి. బాబు. ఫీల్డ్ సిబ్బంది. ఉపాధి కూలీలు. పాల్గొన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన స్కూల్ గేమ్స్ క్రీడాపోటీలు

సంబేపల్లి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :



సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు గురువారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండల స్థాయిలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ క్రీడా పోటీలను ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలుగు తీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. మండల స్థాయిలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో అండర్ 14, 17 విభాగాల్లో 9 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాటిలో కబడ్డీ, కోకో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్ యోగ, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు ఉన్నాయన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు 11వ తేదీ నుంచి 20వతేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్, క్రీడా పోటీల కన్వీనర్లు సురేంద్ర రాజు, అమర్నాథరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సోమశేఖర్ రెడ్డి, సునీత, హేమలత, షామీర్, ఉపాధ్యాయులు భాస్కర్, చక్రవాణి, మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు.

## గర్భవతులు బాలింతల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి

సంబేపల్లి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:



గర్భవతులు బాలింతల ఆరోగ్య దృష్ట్యా వారి పట్ల ప్రత్యేక దృష్టి సారించి అందుబాటులో ఉండి సూచనలు సలహాలు ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఎఫ్‌పిసి కార్యక్రమంలో భాగంగా బుధవారంమండల పరిధిలోని మోటకట్ల పంచాయతీ వంగిమల్ల వాండ్ల పల్లె లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాల అంగన్వాడి కేంద్రాన్ని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి పిల్లలతో ముచ్చటించారు పిల్లలకు పౌష్టికాహారం అందుతుందా లేదా అని తెలుసుకున్నారు. గర్భవతులు బాలింతల వివరాలను ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు వారికి పౌష్టిక ఆహారంతో పాటు సరైన సమయంలో వాడాల్సిన మందులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు అనంతరం డిఎంహెచ్వో కొండయ్య మాట్లాడుతూ గర్భవతులు బాలింతలు పౌష్టికాహారమైన ఆహారాన్ని తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండటంతో పాటు బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు వారుఆరోగ్య సిబ్బంది సూచించిన సలహాలును పాటించడం మంచిదన్నారు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే సంబంధిత ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బలరాం రాజు హెల్త్ సూపర్వైజర్ సదాశివరెడ్డి ఏఎన్ఎం ప్రమీల 104 డీఈవో రాజు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.